నమస్తే తెలంగాణ
ఖమ్మం
12 | ఖమ్మం, మంగళవారం 12 నవంబర్ 2024 | KHAMMAM

ఇల్లెందు మార్కెట్ యార్డు

అమ్మరు.. కొనరు..

అదే ఇల్లెందు ఏఎంసీ తీరు!

- ఎందుకూ ఉపయోగపడని వ్యవసాయ మార్కెట్ యార్డు
- ఎనిమిది మండలాలున్నా ఎక్కడికక్కడే సరుకుల విక్రయాలు
- ఆనవాళ్లు కోల్పోతున్న 49 ఏళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ
- దళారులు, చిల్లర వ్యాపారులకు అమ్మి మోసపోతున్న రైతులు
- పత్తి, మక్క రైతులను నిండా ముంచుతున్న దళారులు
- పట్టించుకోని మార్కెటింగ్ శాఖ అధికారులు

ఇల్లెందు, నవంబర్ 11 : విశాలమైన యార్డు, గోదాంలు, ఆఫీసు రూంలు, అధికారులు, సిబ్బంది ఉన్నా.. అక్కడ ఒక్క గింజ కూడా కొనరు. రైతులు సైతం తమ పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకురారు. అదే.. ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ ప్రత్యేకత. 1975లో మారుమూల గిరిజన ప్రాంతాలకు దగ్గరగా ఇల్లెందులో ఐదు ఎకరాల విస్తీర్ణంలో అప్పటి ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేసింది. దీని పరిధిలో ఇల్లెందు, టేకులపల్లి, కారేపల్లి, కామేపల్లి, గార్ల, బయ్యారం, గుండాల, ఆళ్లపల్లి మండలాల ఉన్నాయి. ఆ కాలంలో గిరిజన రైతులు పండించే కందులు, పెసర్లు, జొన్నలు, సజ్జల వంటి పంట ఉత్పత్తులు మార్కెట్‌కు తరలించగా క్రయవిక్రయాలు జరిగేవి. గిరిజన రైతులకు మార్కెట్ సౌకర్యవంతంగా ఉండడంతో ఏటా పంట ఉత్పత్తులను తెచ్చి విక్రయించేవారు. ఇలా కొన్నేళ్లు జరిగినా.. కాలక్రమేణా గిరిజన రైతులు అపరాలను తగ్గించి వాణిజ్య పంటల సాగువైపు మొగ్గు చూపారు. పత్తి, మిర్చి సాగు చేసిన రైతులు ఆయా పంటలను సదరు మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారులు కొనుగోలు చేసేవారు కాదు. దీంతో రైతులు తమ పంటలను తీసుకురావడం ఆపేశారు. అప్పటి నుంచి ఆ మార్కెట్ ఉనికి కోల్పోయింది. చెప్పుకునేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నా అది ఉత్సవ విగ్రహంలానే మిగిలిపోయింది.

మార్కెట్ యార్డులో ఉన్న గోడౌన్‌లు

దళారుల బెడద, చిల్లర కౌంటర్లు

గిరిజన రైతులు తాము పండించిన పత్తి, మిర్చి పంట ఉత్పత్తులను వ్యవసాయ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించేందుకు ప్రస్తుతం అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అప్పట్లో ఎడ్ల బండ్లపై తీసుకెళ్లేవారు కాబట్టి రవాణా ఖర్చులు ఉండేవి కావు. కానీ.. ఇప్పుడు వాహనాల్లో తరలించాలంటే దూరాన్ని బట్టి ఖర్చులు అధికమవుతున్నాయి. ఈ వ్యయాన్ని తగ్గించుకునేందుకు రైతులు స్థానికంగా తమ పంటలను విక్రయించుకుంటున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు, పత్తి చిల్లర కాంటా వ్యాపారులు.. అందిన కాడికి దండుకుంటున్నారు. పత్తికి ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 ఉంటే.. దళారులు, చిల్లర వ్యాపారులు రూ.5,500 నుంచి రూ.6 వేల మధ్య కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం, మొక్కజొన్న విక్రయాల్లో సైతం తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. చిల్లర కాంటాలను అరికట్టాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

యార్డులోనే కొనుగోళ్లు చేపట్టాలి..

నాకున్న ఏడెకరాల భూమిలో నాలుగెకరాల్లో పత్తి వేశాను. మొదటి దశలో తీసిన పత్తిని ఇల్లెందు మార్కెట్‌లో అమ్మలేని పరిస్థితి. ఖమ్మం మార్కెట్‌కు తీసుకెళితే ఖర్చు ఇంకా ఎక్కువ అవుతుంది కాబట్టి మా ఊళ్లోనే విక్రయిస్తున్నా. బయట అమ్మడంతో మాకు మద్దతు ధర రావడం లేదు. ప్రభుత్వం ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు అండగా నిలవాలి.

–మాలోత్ పూలసింగ్, రైతు, కొత్తతండా(జి), టేకులపల్లి

త్వరలోనే క్రయవిక్రయాలు ప్రారంభిస్తాం..

యార్డు పరిధిలో ఉన్న ఎనిమిది మండలాల్లో ప్రజలు, ప్రభుత్వ అనుమతితో కొనుగోలు చేస్తున్న సంఘాలు, స్థానిక వ్యాపారులతో కలిసి చర్చిస్తాం. ఇల్లెందు మార్కెట్‌లో క్రయవిక్రయాలను త్వరలోనే ప్రారంభిస్తాం. మార్కెట్ ద్వారా లైసెన్స్ ఉన్న వ్యాపారుల దగ్గర, ప్రభుత్వ అనుమతితో సొసైటీల వద్ద విక్రయించడం వల్ల రైతులు మద్దతు ధర పొందడానికి అవకాశం ఉంది. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు.

–వి.నరేశ్, మార్కెట్ కార్యదర్శి, ఇల్లెందు

మద్దతు ధరకు ప్రభుత్వమే కొనాలి..

నాకున్న నాలుగెకరాల భూమిలో మూడెకరాల్లో మొక్కజొన్న వేశాను. ఈ పంటకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,225. అయితే మా గ్రామానికి సమీపంలో వ్యవసాయ మార్కెట్ లేదు. దీంతో బయట చిల్లర వ్యాపారులకు అమ్ముదామంటే సరైన ధర ఇవ్వట్లేదు. దూరంగా ఉన్న ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తీసుకెళ్లలేక ఇబ్బంది పడుతున్నాం. ఇల్లెందు మార్కెట్‌ను ప్రారంభించి మద్దతు ధర వచ్చేలా చూడాలి. **–అజ్మీరా భావ్‌సింగ్, రైతు, రొంపేడు, ఇల్లెందు**

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు

రాష్ట్రంలో రాక్షస పాలన

- కేసీఆర్ విషయంలో ప్రజలు ఎంతో బాధపడుతున్నారు
- ఉద్యమసారథి పాలన అందించే రోజులు మళ్లీ వస్తాయి
- కాంగ్రెస్ గ్రూపులతో అధికారులు పనిచేయలేకపోతున్నారు
- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు

భద్రాచలం, నవంబర్ 11: రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలంటూ ఎన్నికలకు ముందు ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పటికి పది నెలలు దాటినా ఆ హామీలను అమలుచేయడం లేదని ఆరోపించారు. భద్రాద్రి జిల్లా భద్రాచలం పట్టణంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మంచి కంటే చెడే ఎక్కువగా జరిగిందని స్పష్టం చేశారు. శ్రీరాముడి లాంటి కేసీఆర్‌ను అరణ్యవాసం పంపించామని ప్రజలు ఎంతో బాధపడుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కేసీఆరే ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ప్రజల ఆశీస్సులు ఆయనకు ఎప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు. ఒకవైపు రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు ముఖ్యమంత్రి, మంత్రులు మాత్రం పొరుగు రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్తున్నారని, ప్రభుత్వ పాలనకు గాలికొదిలేశారని విమర్శించారు. గత కేసీఆర్ పాలనలో రాజులా బతికిన రైతులు.. నేటి కాంగ్రెస్ పాలనలో చితికిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ముమ్ముందు పతనం తప్పదని హెచ్చరించారు. అలాగే, ప్రస్తుతం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాలుగు గ్రూపులుగా ఉందని, గ్రూపుల వారీగా నేతల బెదిరింపుల కారణంగా ఏ అధికారీ స్వేచ్ఛగా పనిచేయలేకపోతున్నారని అన్నారు. ఫలానా పనిని ఇలా చేయాలని ఓ మంత్రి ఓ అధికారికి ఫోన్ చేసి చెబితే.. దానిని ఇంకోలా చేయాలని మరో మంత్రి ఫోన్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. అలాగే, 7 నుంచి 9 శాతం కమీషన్లు తీసుకుని మరీ ప్రభుత్వ పనులకు బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపించారు.

అధికారం కోసమే పార్టీ మారాడు..

గులాబీ శ్రేణుల కష్టార్జితంతో గెలిచిన స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు.. కేవలం అధికారం కోసమే పార్టీ మారాడని ఎమ్మెల్సీ తాతా మధు విమర్శించారు. పార్టీ మారి అతడు ఏం తప్పు చేశాడో అతడికి తెలుస్తుందని అన్నారు. ఇప్పటికే తమ పార్టీలోకి వచ్చేందుకు కొందరు చూస్తున్నారని అన్నారు. కానీ ఏ దరిద్రాన్ని తమ పార్టీలోకి రానీయబోమని స్పష్టం చేశారు. పార్టీని నమ్ముకున్న నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని భరోసానిచ్చారు. పార్టీ నాయకులు మానే రామకృష్ణ, ఆకోజు సునీల్‌కుమార్, రేపాక పూర్ణచందర్‌రావు, బిక్కసాని శ్రీనివాసరావు, వల్లూరిపల్లి వంశీకృష్ణ, కామిరెడ్డి రామకొండారెడ్డి, కోలా రాజు, ఐనాల రామకృష్ణ, దానియేలు, ప్రదీప్, శివ, యువరాజ్, అంబటిక్రర కృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, నవంబర్ 11 : పలు సమస్యలపై బాధితులు సమర్పించే అర్జీలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచొద్దని కలెక్టర్ సూచించారు. వైరా మండలం పాలడుగు గ్రామానికి చెందిన రంగయ్య, కొణిజర్ల మండలం సాలెబంజర గ్రామానికి చెందిన వి.రాజేశ్వరి తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. వైరా మండలం గొల్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాల స్థలంలో అక్రమంగా సెల్ టవర్ నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బోనకల్ మండలం పెద్ద బీరవల్లి గ్రామానికి చెందిన వారి అసైన్డ్ భూమిని అక్రమించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు కేంద్ర తొలి విద్యా శాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సమావేశ మందిరంలో నిర్వహించిన మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, డీఆర్‌వో రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రతీ దరఖాస్తునూ క్షుణ్ణంగా పరిశీలించాలి

భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం టౌన్, నవంబర్ 11 : ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి.. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. దరఖాస్తు చేసిన వారి వివరాలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ శాఖలవారీగా అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని రైటర్‌బస్తీ, గొల్లగూడెంలో నివాసం ఉంటున్న కంచం నాగయ్య, రుద్రంపూర్‌లో నివాసం ఉంటున్న సాంబత్తుల షర్మిల, పాల్వంచ మండలం జగ్గుతండాకు చెందిన రాపోలు కొమరయ్య, రామవరం 12వ వార్డులో నివాసం ఉంటున్న బొంకూరి శంకర్ తమ తమ సమస్యలపై విజ్ఞప్తులను కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- ఒకేరోజు 32వేల బస్తాలు రాక
- భారీగా పడిపోయిన ఎండుమిర్చి ధరలు

మార్కెట్‌యార్డుకు పోటెత్తిన పత్తి



ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 11 : రెండ్రోజుల సెలవుల అనంతరం తిరిగి మార్కెట్‌లో పత్తి క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. దీంతో సోమవారం ఉదయం ఆన్‌లైన్ బిడ్డింగ్ సమయానికి గాను వివిధ జిల్లాల నుంచి పత్తి రైతులు రికార్డు స్థాయిలో 32 వేల బస్తాలను మార్కెట్‌కు తీసుకొచ్చారు. దీంతో పత్తియార్డులో ఎటుచూసినా తెల్ల బంగారంతో కళకళలాడింది. అయితే అపరాల షెడ్ సైతం పూర్తిగా నిండిపోవడంతో మిర్చియార్డును సైతం పత్తి క్రయవిక్రయాలకు అధికారులు సిద్ధం చేశారు. సీసీఐ నిబంధనల కారణంగా జిన్నింగ్‌మిల్లుల యజమానులు ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో కొద్దిసేపు పత్తి ఖరీదుదారులు కొనుగోళ్లను నిలిపివేసి జిన్నింగ్‌మిల్లు యజమానులకు సంఘీభావం తెలిపారు. దీంతో గంట ఆలస్యంగా క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. అనంతరం జరిగిన ఈ బిడ్డింగ్‌లో పత్తి ధర క్వింటాల్ గరిష్ఠంగా రూ.6,850 పలుకగా, కనిష్ఠ ధర క్వింటాల్ రూ.5,700 చొప్పున ఖరీదుదారులు పంటను కొనుగోలు చేశారు. భారీగా పంట రావడంతో మార్కెట్ కమిటీ సెక్రటరీ పత్తి ఖరీదుదారులతో సమావేశం నిర్వహించారు. త్వరితగతిన క్రయవిక్రయాలు, తోలకాల ప్రక్రియ పూర్తి చేసి. సకాలంలో రైతులు ఇంటికి వెళ్లే విధంగా చూడాలని ఆదేశించారు. దీంతో సాయంత్రం వరకు మార్కెట్లో క్రయవిక్రయాల ప్రక్రియ కొనసాగింది.

భారీగా పడిపోయిన మిర్చి ధరలు..

గత కొద్దిరోజుల నుంచి నగర వ్యవసాయ మార్కెట్లో మిర్చి ధరలు భారీగా పడిపోతున్నాయి. ఈ సంవత్సరం సీజన్‌లోనే ఏసీ మిర్చి ధరలు క్వింటాల్ రూ.21 వేల వరకు పలికింది. అయితే ఏసీలో నిల్వ పెట్టుకుంటే మరింత లబ్ధి పొందవచ్చని భావించిన రైతులకు తీవ్ర నిరాశ ఎదురైంది. నాలుగురోజుల క్రితం కొత్త మిర్చి పంటకు క్వింటాల్ రూ.16,500 పలుకగా, సోమవారం వీటి ధర కేవలం రూ.13 వేలు మాత్రమే పలికింది. ఇక ఏసీలో నిల్వ పెట్టుకున్న పంటకు క్వింటాల్ గరిష్ఠ ధర రూ.17,800 పలుకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జెండాపాట కేవలం కొద్దిమంది రైతులకు మాత్రమే నమోదు కాగా, మిగిలిన రైతులకు క్వింటాల్ రూ.17 వేల వరకు మాత్రమే ధర వస్తున్నది. వరుసగా ఏసీ పంటల ధరలు తగ్గుతుండడంతో రైతులు వేదన చెందుతున్నారు.

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో రాహుల్

గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, నవంబర్ 11 : జీవనోపాధి కల్పించడానికి అమలు చేస్తున్న పథకాలు అర్హులైన గిరిజనులకు అందించడమే ఐటీడీఏ లక్ష్యమని పీవో రాహుల్ అన్నారు. గిరిజన దర్బార్‌లో స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడం కోసం మాత్రమే గిరిజనులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భద్రాచలం ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి పీవో అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించిన ఆయన త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలని వివిధ శాఖల అధికారులకు పంపించారు. ట్రైకార్ ద్వారా సబ్సిడీ రుణాలు, పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాల కోసం రుణాలు, పట్టా భూములకు రైతుబంధు, జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థిక సాయం, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకునేందుకు సాయం, గురుకుల సీట్లు, పై చదువులకు ఆర్థిక సాయం వంటి సమస్యలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఎస్‌డీసీపీ రవీంద్రనాథ్, ఈఈ తానాజీ, ఎస్‌వో భాస్కరన్, ఏవో సున్నం రాంబాబు, ఏపీవో(పవర్) ఏఈ మునీర్‌పాషా, డీటీఆర్‌వోఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, డీఎస్‌వో ప్రభాకరరావు, పీవీటీజీ అధికారి మణిధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులు మావోయిస్టులు

మావోల కట్టడికి సరిహద్దు రాష్ట్రాలను సమన్వయం చేసుకోవాలి

సరిహద్దు జిల్లాల పోలీసు అధికారుల సమావేశంలో రాష్ట్ర డీజీపీ జితేందర్

ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర డీజీపీ జితేందర్

బూర్గంపహాడ్, నవంబర్ 11 : మావోయిస్టులు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటూ.. అభివృద్ధి నిరోధకులుగా మారారని రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. సారపాక ఐటీసీ అతిథి గృహంలో ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి, మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి ములుగు, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పోలీసు అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ మావోయిస్టులను కట్టడి చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ఈ విషయంలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పొరుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో అధికారులను సమన్వయం చేసుకుంటూ మావోయిస్టుల కదలికలపై ముందుకు సాగాలన్నారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయకులైన ఆదివాసీలను అభివృద్ధి, సంక్షేమానికి దూరం చేస్తూ మావోయిస్టు అగ్ర నాయకులు తమ పబ్బం గడుపుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు విద్య, వైద్యం, రవాణా, ఇతర సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తున్నాయన్నారు. తొలుత డీజీపీ జితేందర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులకు కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. సమావేశంలో అడిషనల్ డీజీ విక్రంతా కూర్, ఐబీ రుత్విక్ రుద్ర ఐపీఎస్, ఐబీ స్పెషల్ డైరెక్టర్ చారుసిన్హా, సీఆర్‌పీఎఫ్ ఐజీ, సీఆర్‌పీఎఫ్ సదరన్ సెక్టార్ హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి ఎస్పీలు రోహిత్ రాజు, శబరీష్, కిరణ్ కర్రే, గ్రేహౌండ్స్ ఎస్పీ రాఘవేందర్‌రెడ్డి, ట్రైనీ ఐపీఎస్‌లు, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఆయా జిల్లాల డీఎస్పీ పాల్గొన్నారు.

గోదావరి తీర ప్రాంతాల్లో నిఘా పెంచాలి

వరంగల్ మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

ఏడూళ్ల బయ్యారం స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

పినపాక, నవంబర్ 11 : మావోయిస్టుల సంచారం ఎక్కువగా ఉన్న గోదావరి తీర ప్రాంతాల్లో మరింత నిఘా పెంచాలని వరంగల్ మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఏడూళ్లబయ్యారం పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను ప్రోత్సహించాలని, యువత అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్లకుండా వారి అభిరుచుల మేరకు విద్య, ఉపాధి మార్గాల వైపు వెళ్లేలా ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేయాలన్నారు. అనంతరం నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై రాజ్‌కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

'విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఉండొద్దు'

పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ లక్ష్మయ్య

పాల్వంచ, నవంబర్ 11 : విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని టీజీ జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య ఆదేశించారు. పాల్వంచలోని కేటీపీఎస్ ఏడో దశ కర్మాగారాన్ని సోమవారం ఆయన సందర్శించారు. కోల్ ప్లాంట్‌లోని అన్ని డివిజన్లను సందర్శించి.. ఉత్పత్తికి సంబంధించిన బొగ్గు నిల్వలు తదితర విభాగాలను సమగ్రంగా తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. విద్యుత్ ఉత్పత్తిలో ఆటంకం కలగకుండా.. బొగ్గు నిల్వలు సమృద్ధిగా ఉండేలా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఈ వెంకటేశ్వరరావు, ఎస్ ఈలు శ్రీనివాసరావు, యుగపతి, గుర్రం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.